

పరిమితికి మించి నగదు తీసుకెళ్లొద్దు

ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ

ప్రజాశక్తి - భీమడోలు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాహనదారులు నిర్ణీత పరిమితికి మించి నగదును తీసుకువెళ్లరాదని, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. ఆదివారం ఆయన భీమడోలు సమీపంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ వద్ద తనిఖీ బృందాల పనితీరును పరిశీలించారు. సుమారు 100 వరకు ద్విచక్ర, మోటార్ వాహనాల తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట తీసుకువెళ్లే నగదు, ఇతర వస్తువులకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. తనిఖీ అధికారులు కోరితే చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ వరాహలయ్య, భీమడోలు సిఐ బిబి.రవికుమార్, ఎస్ఐ సుధాకర్‌తో పాటు చెక్‌పోస్ట్ బాధ్యులు భీమడోలు సిఎస్‌జిటి ఎ.మాధవరావు పాల్గొన్నారు.

తాగునీటిపై.. ఏం చెబుతారో..!

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజలను వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో తాగునీరు ప్రధానమైంది. తాము అధికారంలోకి వస్తే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆశ చూపడం, గెలిచిన తర్వాత జిల్లా ప్రజలను మోసం చేయడంలో వైసిపి, టిడిపి రెండు పార్టీలు ఒకే బాటలో నడిచాయి. ముచ్చటగా మూడోసారి ఎన్నికల్లో తాగునీటి సమస్యపై ఇరు పార్టీలు ఎటువంటి అబద్ధాలు చెబుతాయో అంటూ జిల్లా ప్రజానీకంలో చర్చ కొనసాగుతోంది.



జిల్లా ప్రజలను మోసగించిన వైసిపి, టిడిపి
2014 నుంచి తాగునీటి సమస్యకు పరిష్కారం నిల్
వాటర్‌గ్రిడ్ పేరుతో ఆశలు.. ఒక్క రూపాయి ఖర్చుచేయని పరిస్థితి
ఆక్వా కాలుష్యంతో తాగునీటికి డెల్టా ప్రజలు విలవిల
ఈ సారి ఎన్నికల్లో ఏం మాయమాటలు చెబుతారోనన్న చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిబంధలనకు విరుద్ధంగా సాగిన చేపల చెరువుల తవ్వకాలతో తాగునీటి వనరులన్నీ కలుషితమై ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని దాదాపు 25 మండలాల ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని దుస్థితి ప్రజలకు నెలకొంది. ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయి. ఎన్నికల్లో ఓట్ల కోసం జనాలకు మాయమాటలు చెప్పడం, గెలిచిన తర్వాత జిల్లా ప్రజల గోడు పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. దాదాపు 30 లక్షల జనాభా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించకుండా పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఆడిన డ్రామా గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. వ్యర్థాలు, పురుగుమందులు కలిపిన ఆక్వా చెరువుల్లోని నీటిని పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఆ పంటకాలువల ద్వారా వచ్చే నీటితోనే తాగునీటి చెరువులను నింపుతున్నారు. దీంతో పసర్లు కమ్మి కలుషితంగా మారిన నీటిని జనం తాగలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రతిరోజునూ రూ.20 వెచ్చించి తాగునీరు కొనుగోలు చేస్తే తప్ప ఏ కుటుంబానికీ రోజు గడవని పరిస్థితిని తీసుకొచ్చారు. కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని టిడిపి హామీలు గుప్పించింది. ప్రతి కుటుంబానికీ 20 లీటర్ల నీరు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఐదేళ్ల పాలనలో ఏ ఒక్కటీ టిడిపి ప్రభుత్వం నెరవేర్చకపోగా, విచ్చలవిడిగా చేపల చెరువుల తవ్వకాలకు అనుమతివ్వడంతో తాగునీరు మరింత అధ్వానంగా మారింది. 2019 ఎన్నికలకు ముందు వైసిపి అధ్యక్షుడు జగన్ తాగునీటి సమస్యను ప్రధాన ఆయుధంగా చేసుకుని అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వాటర్ బాటిల్‌లో తాగునీరు నింపి ఆ నీటిని మనుషులు తాగుతారా అంటూ విమర్శలు సంధించేవారు. తాము అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని ప్రజలకు అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ కోసం రూ.3,200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇంకేముంది రెండు, మూడేళ్లలో అందరికీ గోదావరి నుంచి నేరుగా తాగునీరు ఇంటికి చేరుతుందని ఊదరగొట్టారు. ఇప్పటి వరకూ ఒక్క అడుగు పడలేదు.. ఒకపైసా ఖర్చు పెట్టిన పాపన పోలేదు. గడిచిన ఐదేళ్లలో తాగునీటి వనరులను మరింత అధ్వానంగా తయారు చేశారు.

మోసపూరిత మాటలతో అత్యధిక స్థానాలు కైవసం..

2014లో ఎన్నికల్లో టిడిపి తాగునీటిపై చెప్పిన మోసపూరిత మాటలను జిల్లా ప్రజలు నమ్మారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని నమ్మి ఉమ్మడి జిల్లాలో ఉన్న 15 అసెంబ్లీ స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడంలో జిల్లాలో గెలిచిన స్థానాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఇదే విషయం అనేకసార్లు టిడిపి అధినాయకుడు చంద్రబాబు సైతం అనేక బహిరంగ సభల్లో ప్రస్తావించారు. ఆయన తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు 2019లో తాగునీటిపై వైసిపి అధ్యక్షుడు జగన్ చెప్పిన మాటలను నమ్మారు. 'మాట తప్పను.. మడమ తిప్పను' అంటూ ఆయన చెప్పిన మాటలను జనం విశ్వసించారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాలకు గాను 13 చోట్ల వైసిపి గెలిపించారు. ఐదేళ్ల పాలనలో జిల్లా ప్రజలకు తాగునీటి వాగ్దానాన్ని జగన్ పరిష్కరించలేకపోయారు. వైసిపి, టిడిపి సైతం తాగునీటి విషయంలో జిల్లా ప్రజలను మోసం చేయడంతో జనానికి ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మరోసారి ఇరు పార్టీలు తమకు ఓటువేయాలని ప్రజల ముందుకొస్తున్నాయి. పరిష్కారం కాకుండా ఉన్న తాగునీటిపై ఏం మాయమాటలు చెబుతాయో అన్న చర్చ జనాల్లో నడుస్తోంది. ఇరు పార్టీలకు జనం బుద్ధిచెబితే తప్ప జిల్లా ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

ఆ ముగ్గురు ఎవరు..!

కలవరపడుతున్న జిల్లా అధికార యంత్రాంగం
సి విజిల్ యాప్ ఫిర్యాదుదారుల వివరాలు బహిర్గతం చేశారని ఆరోపణలు
రెండు, మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ సుమిత్ కుమార్
ఇటీవల ఏలూరు జిల్లాలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
పశ్చిమగోదావరి జిల్లాలో కూడా సస్పెన్షన్ తప్పదా ?

ప్రజాశక్తి - భీమవరం

అటు రాజకీయ నాయకులు.. ఇటు ఎన్నికల అధికారుల్లో భయం పుట్టిస్తున్న ఏకైక యాప్ సి విజిల్ యాప్.. రాజకీయ నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు ఈ సి విజిల్ యాప్ ఎంతో ఉపకరిస్తుంది. ఈ యాప్‌ను మోనిటరింగ్ చేస్తున్న అధికారులు ఫిర్యాదు చేసిన వారి వివరాలు బహిర్గతం చేస్తే కఠిన చర్యలకు అధికారులు వారంతటికి వారే కొని తెచ్చుకున్నట్లే. పక్కా నిఘాలో పర్యవేక్షిస్తున్న ఈ సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు దారుడి వివరాలు బహిర్గతం చేశారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో రెండు, మూడు రోజుల్లో ఇద్దరూ లేక ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోబోతున్నట్లు, వారు ఎవరో చెబుతామంటూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేసిన వ్యాఖ్యలు అధికారుల్లో కలకలం రేపుతున్నాయి.

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా సాఫీగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు చేపట్టింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసే అన్ని రకాల వనరులను ఉపయోగిస్తుంది. దీనిలో భాగంగానే తీసుకొచ్చిన సి విజిల్ యాప్ ఒకటి. ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించిన రాజకీయ నాయకుల పని పట్టేందుకు సామాన్య ప్రజలు దీన్ని పాశుపతాస్త్రంగా ఉపయోగించేందుకు అధికారులు ప్రజల్లోకి తీసుకొచ్చారు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం, ఎక్కడైనా ఎన్నికల వల్ల కనిపిస్తే ఎవరైనా యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ సి విజిల్ యాప్‌ను జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే ఈ యాప్‌ను నిరంతరం పర్యవేక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి సి విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, అధికారులు సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని సాక్ష్యాలతో సహా ఇందులో పొందుపర్చవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్ లో అప్లోడ్ చేయాల్సి ఉంది. ఈ యాప్ లో ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులకు రంగంలోకి దిగి 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని విచారించిన 30 నిమిషాల్లో వివరాలు సేకరించిన అనంతరం ఎన్నికల అధికారికి నివేదిక పంపిస్తారు. అయినా వచ్చిన ఫిర్యాదుపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా వంద నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై పకడ్బందీగా చర్యలు చేపట్టారు. అయితే ఈ సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన ఫిర్యాదుదారుడి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే కొంత మంది అధికారులు నిబంధనలు తుంగలోతొక్కి నియమావళిని ఉల్లంఘించే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదుదారుల వివరాలను ఫిర్యాదు చేసిన సంబంధిత రాజకీయ పార్టీలు అభ్యర్థులకు అందిస్తున్నారని ఆరోపణలు జిల్లాలో బలంగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి దాసోహంగా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా అధికంగానే వినిపిస్తున్నాయి.

జిల్లాలో సి విజిల్ యాప్ పర్యవేక్షణతో పాటు ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. అలాగే ఫిర్యాదుదారుని వివరాలు బహిర్గతం కాకుండా చర్యలు తీసుకున్నారు. బహిర్గతం చేస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటివరకు 41 ఫిర్యాదులు సి విజిల్ యాప్ ద్వారా అందాయి. దీనిలో 29 ఫిర్యాదులు పరిష్కరించడం జరిగింది. మరో 19 ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించారు. ఈ వివరాలను జిల్లా కలెక్టరేట్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్లతో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంలో సి విజిల్ యాప్ ఫిర్యాదులపై ఏ విధంగా వ్యవహరిస్తున్నారు, ఫిర్యాదుదారుని వివరాలు బహిర్గతం చేస్తే ఎటువంటి చర్యలు తీసుకుంటారని ప్రజాశక్తి ప్రశ్నించింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఫిర్యాదుదారుని వివరాలు బహిర్గతం చేస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. జిల్లాలో ఈ అంశంపై సమగ్ర విచారణ జరుగుతుందని, ఇద్దరు లేదా ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోబోతున్నట్లు చెప్పారు. ఇది మున్సిపాల్టీ అయినా కావచ్చు మరో ఏదో ప్రాంతమైన కావచ్చు అంటూ చేసిన వ్యాఖ్యలు అధికారుల్లో కలకలం సష్టించాయి. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు అధికారులు ఎవరనేది సార్వత్రా చర్చ సాగుతుంది. ముఖ్యంగా అధికారుల్లో సస్పెన్షన్ టెన్షన్ నెలకొంది. ఇప్పటికే పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఒక అధికారిని వేరే ప్రాంతానికి బదిలీ చేస్తున్నట్లు సమాచారం.

ఏలూరు జిల్లాలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

సి విజిల్ ఫిర్యాదు బహిర్గతమైన ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన చేబ్రోలు గ్రామ సచివాలయం-1 పంచాయతీ కార్యదర్శి బివి.రవిచంద్రకుమార్, ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్ట్ బి.అమృతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఎంపిడిఒ శర్మకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నల్లమాడు గ్రామ శివారు రామచంద్రపురంలో గ్రంథాలయం, వాటర్ ప్లాంట్‌కు వైసిపి రంగులు ఉండడంతో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈ నెల 19న సి విజిల్ యాప్‌లో ఫిర్యాదుచేశాడు. స్పందించిన అధికారులు గంటలోపే దానికి తెల్లసున్నం వేయించారు. ఫిర్యాదుదారుల విషయాన్ని గోప్యంగా ఉంచాల్సిన సిబ్బంది అతని వివరాలు తెలిపేలా ల్యాబ్‌టాప్‌లో స్క్రీన్ షాట్ తీసి అధికార పార్టీ నాయకులకు సమాచారం అందించారు. దీంతో ఫిర్యాదుదారుడి స్నేహితుడిని వైసిపి నాయకుడు నిలదీశాడు. ప్రభుత్వ సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గోప్యంగా ఉంచాల్సిన ఫిర్యాదుదారుడి సమాచారాన్ని బహిర్గతం చేసిన బాధ్యులపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇటువంటి చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

రఘు రామకృష్ణంరాజుకు ఝలక్..!

నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థిగా శ్రీనివాస వర్మకు టిక్కెట్
తానే పోటీ చేస్తానంటూ గతంలో ప్రకటించిన రఘు రామకృష్ణంరాజు టిక్కెట్ ఇచ్చేందుకు బిజెపి నిరాకరణ
చర్చనీయాంశంగా రఘు రామకృష్ణంరాజు రాజకీయ భవితవ్యం
విజయనగరం ఎంపీ అభ్యర్థిగా టిడిపి నుంచి పోటీ చేయనున్నారా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నరసాపురం పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన భూపతిరాజు శ్రీనివాస వర్మకు టిక్కెట్ ఖరారైంది. మాజీ ఎంపీ కనుమూరి రఘు రామకృష్ణంరాజుకు బిజెపి అధిష్టానం ఝలక్ ఇచ్చింది. నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి తానే పోటీచేస్తానంటూ ప్రకటించుకున్న రఘు రామకృష్ణంరాజు పరిస్థితి ఏంటన్న చర్చ రాజకీయాల్లో జోరుగా కొనసాగుతోంది. 2014లో బిజెపి నుంచి నరసాపురం పార్లమెంట్ టిక్కెట్‌ను రఘు రామకృష్ణంరాజు ఆశించారు. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీగా బిజెపి గోకరాజు గంగరాజును బరిలోకి దింపి రఘు రామకృష్ణంరాజును పక్కకు పెట్టింది. తాను టిడిపి నుంచి పోటీలో ఉంటానంటూ నామినేషన్ సైతం వేశారు. ఏ పార్టీ నుంచి బిఫాం రాకపోవడంతో నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. 2019లో టిడిపి నుంచి నరసాపురం ఎంపీగా పోటీలోకి దిగుతారని అంతా భావించారు. టిడిపి సైతం రఘు రామకృష్ణంరాజుకే టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధపడింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆయన వైసిపిలో చేరి ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసి గెలిచారు. గెలిచిన కొద్దిరోజుల తర్వాత వైసిపి రెబల్‌గా మారారు. వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసేవారు. దీంతో ఆయనను అరెస్టు చేయడం వంటి చర్యలు సైతం సాగాయి. అరెస్టు ఘటన తర్వాత రఘు రామకృష్ణంరాజు పూర్తిగా టిడిపి తరపున మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని ఎండగట్టేవారు. దీంతో ఈ సారి టిడిపి నుంచి రఘు రామకృష్ణంరాజు పోటీచేస్తారని అంతా భావించారు. కొద్దిరోజుల క్రితం తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన ఉమ్మడి బహిరంగ సభకు హాజరైన రఘు రామకృష్ణంరాజు నరసాపురం ఎంపీగా తానే పోటీచేస్తానంటూ చంద్రబాబు, పవన్ ముందే ప్రకటించుకున్నారు. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం బిజెపికి వెళ్లింది. దీంతో రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ వస్తుందా రాదా అన్న చర్చ గత కొద్దిరోజులుగా కొనసాగుతోంది.. గతంలో బిజెపి జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన భూపతిరాజు శ్రీనివాస వర్మకు టిక్కెట్ ఇవ్వడంతో రఘురామకృష్ణంరాజుకు పూర్తిగా తలుపులు మూసుకుపోయాయి. బిజెపి రఘు రామకృష్ణంరాజుకు ఝలక్ ఇవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సోమూ వీర్రాజు ద్వారా రాయబారం నడిపి తనకు వైసిపి టిక్కెట్ రాకుండా చేసిదంటూ రఘు రామకృష్ణంరాజు చెబుతున్న పరిస్థితి నెలకొంది. రఘు రామకృష్ణంరాజు రాజకీయ భవిష్యత్తు ఏంటన్న చర్చ సర్వత్రా నెలకొంది. విజయనగరం ఎంపీగా టిడిపి నుంచి రఘు రామకృష్ణంరాజు పోటీచేసే అవకాశం ఉందన్న ప్రచారం సైతం కొనసాగుతోంది.



భూపతిరాజు శ్రీనివాస వర్మ

కాంగ్రెస్‌లోకి ఎంఎల్ఎ ఎలిజా..!

❑ ఎన్నికల బరిలో తలపడేందుకు సమాయత్తం
❑ ఎలిజాతో చింతలపూడి నియోజకవర్గంలో నష్టం ఏ పార్టీకో

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా పార్టీ కండువా కప్పి ఆదివారం ఎలిజాను పార్టీలోకి ఆహ్వానించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా తెలపడంతో చింతలపూడి నియోజవర్గంలో చర్చనీయాంశంగా మారింది. 2019లో వైసిపి నుంచి చింతలపూడి ఎంఎల్ఎగా ఎలిజా గెలిచారు. 2024 ఎన్నికల్లోనూ వైసిపి నుంచి ఎలిజా టిక్కెట్ ఆశించారు. వైసిపి అధిష్టానం మాత్రం రవాణాశాఖ అధికారి విజయరాజుకు టిక్కెట్ ఇచ్చింది. అప్పటి నుంచి ఎలిజా చాలా ఆగ్రహంగా ఉన్నారు. ఎంఎల్ఎగా ఎలిజా ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాలు సైతం వైసిపి అభ్యర్థిగా ఉన్న విజయరాజు పాల్గొనడం సమస్యగా మారింది. అనేక సార్లు ఎలిజా దీనిపై తీవ్రంగా స్పందించారు. ఎలిజా టిడిపిలో చేరే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. టిడిపి సొంగా రోషన్ కుమార్‌కు టిక్కెట్ ప్రకటించింది. దీంతో ఎలిజా రాజకీయ భవిష్యత్తు ఏంటన్న దానిపై చర్చ కొనసాగింది. కాంగ్రెస్‌లో చేరడంతో కథ సుఖాంతమైంది. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎలిజా చింతలపూడి నియోజకవర్గం నుంచి బరిలో దిగే అవకాశం ఉందని స్పష్టంగా కనిపిస్తోంది. అదే జరిగితే వైసిపి, టిడిపిలో ఎవరికి నష్టమన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది. ఐదేళ్ల పదవీకాలంలో ఎలిజా తనకంటూ సొంత బలాన్ని కొంతమేర పెంపొందించుకున్నారు. ఎన్ని ఓట్లు చీలినా అవి వైసిపికి చెందిన ఓట్లే ఉంటాయని అంచనా వేస్తున్నారు. అదే క్రమంలో టిడిపి, బిజెపి పొత్తును వ్యతిరేకించేవారు కాంగ్రెస్‌కు ఓటు వేసే అవకాశం ఉంది. దీంతో ఎలిజా బరిలోకి దిగితే ఎవరికి నష్టం జరుగుతుందో చూడాల్సి ఉంది.



ఎలిజాకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన షర్మిల

ఎన్‌డిఎ కూటమిని, వైసిపిని ఓడించాలి

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఎన్‌డిఎ కూటమిని, వైసిపిని ఓడించాలని, ఇండియా ఫోరం పార్టీల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పవరుపేటలోని పార్టీ జిల్లా కమిటీ సభ్యుల సమావేశానికి సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు సమస్యలపై చర్చించి, తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోనూ, రాష్ట్రంలో దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఒక పక్క ప్రజలను మతం పేరుతో విడగొడుతూ, మరో పక్క ప్రాంతీయ పార్టీలను ఇడి, సిబిఐ తదితర సంస్థలను ఉపయోగించి తన చెప్పుచేతల్లో ఉంచుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. అవినీతి రహిత పాలన దేశానికి అందిస్తున్నామని గొప్పలు చెప్పుకొనే మోడీ ప్రభుత్వం వ్యాపార సంస్థలపై ఐటి దాడులు నిర్వహించి తమ ఖాతాల్లో బ్యాంక్ బ్యాలెన్స్ ఎలక్ట్రోల్ బాండ్స్ రూపంలో పెంచుకుంటోందని, ప్రత్యర్థి పార్టీల బ్యాంక్ ఖాతాలను సీల్ చేసి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందని తెలిపారు. దేశంలో అన్ని పార్టీలకూ వచ్చిన ఎలక్ట్రోల్ బ్యాండ్లలో 60 శాతం కేవలం బిజెపికే ఏ విధంగా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఇది అవినీతి కాదా అన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి పార్టీలు బిజెపి చేతిలో తోలుబొమ్మలని, రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేస్తున్నా ఏ ఒక్కరూ ప్రశ్నించడం లేదని తెలిపారు. బిజెపి, ఆ పార్టీకి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేనను, లోపాయికారి ఒప్పందంతో బిజెపిని ప్రశ్నించలేని వైసిపిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ఇండియా ఫోరం పార్టీల అభ్యర్థులను గెలిపించాలని రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో కరువు, తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని సాగునీరు లేక రైతాంగం అల్లాడుతోందని, ఈ వేసవిలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందుపడే పరిస్థితులు ఉన్నాయని దీనిపై వైసిపి, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేన, బిజెపిలు మాట్లాడడం లేదని విమర్శించారు. వెంటనే దీనిపై స్పందించి ప్రభుత్వం, అధికారులు కరువు ప్రాంతాలను గుర్తించి రైతులకు నీరు అందించే పని చేయాలని, పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు కల్పించాలని, 8 వారాల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరారు. తాగునీటి సమస్య లేకుండా ట్యాంకులతో నీటిని సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇటీవలే విశాఖలో డ్రగ్స్ పెద్దమొత్తంలో పట్టుబడిందని వార్తలు వచ్చాయని, ఏలూరులో కూడా డ్రగ్స్ కు అడ్డగా మారిందని, హైస్కూల్ విద్యార్థులు గంజాయి మత్తుకు లోనౌతున్నారని వార్తలు రావడం ఆందోళన కల్గిస్తోందన్నారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం దీనిపై సీరియస్ గా పనిచేసి డ్రగ్స్ ముఠాలను, గంజాయి అమ్మకాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెల్లం రామకృష్ణ, డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, పి.రామకృష్ణ, టి.దుర్గారావు, ఎన్.నర్సింహ, బి.సోమయ్య, ఎం.జీవరత్నం, గుడిపాటి నరసింహారావు మాట్లాడారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

'చౌదరికే సీటు కేటాయించాలని విజ్ఞప్తి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ సీటు స్థానిక నేత గారపాటి చౌదరికే ఇవ్వాలని జిల్లా బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరుకొని రాష్ట్ర నాయకులకు జిల్లా బిజెపి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఏలూరు పార్లమెంటు సీటు విషయంలో బిజెపి పునరాలోచన చేయాలని, పొత్తులో భాగంగా టిడిపికి చెందిన కడప నాయకుడికి సీటు కేటాయించడం తగదన్నారు. జిల్లాలో బిజెపి సంస్థాగతంగా పటిష్టం చేయడానికి విశేష కృషి చేసిన స్థానికుడైన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరిని పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించాలని కోరుతూ జిల్లా బిజెపి నాయకులు ఆదివారం విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరుకొని రాష్ట్ర మంత్రి మధుకర్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలో బిజెపి ఒక బలమైన శక్తిగా గారపాటి చౌదరి ఆధ్వర్యంలో ఎదిగిందని, గారపాటి చౌదరి సేవల ద్వారా బడుగు బలహీన వర్గాల్లో మంచి పేరు సంపాదించడం వల్ల ఆయనను ఎంపీగా గెలిపించుకుంటే తమ సమస్యలు తీరుతాయని ప్రజలు ఎదురుచూస్తున్నారని బిజెపి నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కొల్లేరు సమస్య, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటివి ముఖ్యమైన పనులు పూర్తి అవ్వాలంటే ఏలూరు ఎంపీగా బిజెపి అభ్యర్థి గెలుపొందితేనే సాధ్యమని ప్రజలు అభిప్రాయ పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్, బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థులు ఖరారు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు స్థానాలకు జనసేన పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. గతంలోనే వీరిని ప్రకటించినప్పటికీ ఆదివారం సాయంత్రం అధికారిక జాబితా కింద విడుదల చేసింది. తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం నుంచి పులపర్తి ఆంజనేయులు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, పోలవరం నుంచి చిర్రి బాలరాజుకు టిక్కెట్లు దక్కాయి. కొన్నిరోజుల క్రితం వీరికి పార్టీ తరపున అభ్యర్థులను ఖరారు చేస్తూ పత్రాలు ఇచ్చిన జనసేన అధిష్టానం ఇప్పుడు అధికారికంగా ప్రకటించింది.



గిరిజన్ భవన్ - రిజిస్ట్రేషన్, వ్యవసాయ శాఖ కార్యాలయం-ఇండోర్ స్టేడియం మైదానంలోని శిలాఫలకాలు

పలు కార్యాలయాల్లో అమలుకాని ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఎనిమిది రోజులు అవుతున్నప్పటికీ చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికీ వివిధ పార్టీల నేతల పేర్లు ఉన్న శిలాఫలకాలను మూయలేదు. ఇండోర్ స్టేడియం మైదానంలో కలెక్టరేట్ వైపు ఉన్న గేటు పక్కన చంద్రబాబు నాయుడు ప్రారంభించిన రెండు శిలాఫలకాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో, దాని ఎదురుగా ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలో, కలెక్టరేట్ ప్రాంగణానికి అతి చేరువుగా ఉన్న గిరిజన భవన్‌లో నేతల పేర్లతో ఉన్న శిలాఫలకాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ శిలాఫలకాలను మూసివేసి, ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.


సమావేశంలో మాట్లాడుతున్న భారతి

హామీలు అమలు చేయాలి

అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన 42 రోజుల సమ్మె పరిష్కారం సందర్భంగా ప్రభుత్వం చేసిన ఎఠాగ్దానాలు తక్షణమే అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో భారతి మాట్లాడుతూ 42 రోజుల సమ్మె వేతనాలు మంజూరు చేస్తూ జిఒ జారీ చేశారని, దానికనుగుణంగా తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేస్తానని సమ్మె సందర్భంగా చేసిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. గ్రాట్యుటీ పెంచుతూ చేసిన నిర్ణయాన్ని వెంటనే జిఒ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలపై రోజురోజుకూ పనిభారం పెంచుతున్నారని, అంగన్వాడీలపై వేధింపులు ఆపివేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వకుండా ఆన్లైన్ పనుల పేరుతో తీవ్రంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, శ్రావణి, లక్ష్మీపార్వతి, వెంకటలక్ష్మి, కమల, రాహేలు పాల్గొన్నారు.

ప్రకాశం కాలేజీకి అనుమతులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో ప్రకాశం కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలకు ఎపి ప్రభుత్వంచే 2024-25 విద్యా సంవత్సరానికి అనుమతులు వచ్చాయని ఛైర్మన్ వి.జనార్ధన్ రావు తెలియజేశారు. ఏల్లూరు జిల్లాలో మెట్ట ప్రాంతలైన పోలవరం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాలలో మొట్ట మొదటిసారిగా కొయ్యలగూడెంలో ప్రకాశం కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు సుధీర ప్రాంతలకు వెళ్లవలసిన అవసరం లేకుండా లోకల్గా చదువుకునే అవకాశం దొరుకుతుందన్నారు. ఈ సువర్ణ అవకాశం అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు.

సప్తగిరి బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సప్తగిరి బ్యాంక్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26 నుంచి తలపెట్టిన రెండు రోజుల ఆందోళన తర్వాత జరగనున్న సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లుగా యూనియన్ అధ్యక్షులు పి.శివరాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను అంగీకరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. హైదరాబాద్లోని కేంద్ర కార్మికశాఖ సహాయ కమీషనర్ జోక్యంతో మే నెలలో యాజమాన్యంతో జరుగు చర్చలను దృష్టిలో వుంచుకొని తమ యూనియన్ తలపెట్టిన ఆందోళనను వాయిదా వేస్తున్నట్లుగా తెలియజేశారు.

నేడు మహేష్ యాదవ్ పరిచయ వేదిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి పుట్ట మహేష్ యాదవ్ ఈనెల 25న ఏలూరుకి రానున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆదివారం టిడిపి కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్లో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం హనుమాన్ జంక్షన్లో ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని ర్యాలీగా ఏలూరు టిడిపి కార్యాలయానికి వస్తారని, అనంతరం పార్టీ నాయకులతో, కార్యకర్తలతో పరిచయవేదిక ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ రావాలని తెలియజేశారు. ఈ ప్రెస్మీట్లో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో టిడిపిలోకి సర్పంచి యువరాజు!

ప్రజాశక్తి - చింతలపూడి

త్వరలో టిడిపిలో పసుపు తీర్థం పుచ్చుకుంటున్నట్లు వర్లగూడెం సర్పంచి కొండబోయిన యువరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉర్లగూడెంలో గ్రామ పంచాయతీ ప్రజలు సుమారు 500 మంది సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. వారందరి నిర్ణయంతో వాళ్లతో కలిసి వైసిపి సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

వైసిపి గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపుకు కృషి చేయాలని ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. వైసిపి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దాసి పండు ఆదివారం వైసిపి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ ఆఫీస్లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సమిష్టిగా పని చేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనను ప్రజలలోకి బలంగా తీసుకు వెళ్లాలని ఆయన తెలిపారు. పార్టీ క్యాడర్ మొత్తం గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

'ముద్రబోయిన ఆచితూచి మాట్లాడాలి'

ప్రజాశక్తి - ముసునూరు

ముద్రబోయిన వెంకటేశ్వరరావు ఆచితూచి మాట్లాడాలని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. ఆదివారం మండలంలోని గుడిపాడు గ్రామంలో విలేఖరులతో మాట్లాడుతూ తెలుగు దేశాన్ని వీడి ఇండిపెండెంట్గా పోటీ చేస్తున్నానని ప్రజల్లోకి వెళుతున్న సందర్భంగా ప్రతిచోటా చంద్రబాబునాయుడు నాకు అన్యాయం చేశారు, టిడిపిని చిత్తుచిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని చెప్తున్నారు. కానీ మీరు గన్నవరంలో ఓడిపోయిన వ్యక్తికి నూజివీడు టిడిపి ఇన్ఛార్జిగా 2014లో మిమ్మల్ని తీసుకురావడం జరిగింది. రెండుసార్లు టిడిపి మీకు అవకాశం ఇచ్చింది. రెండుసార్లు కూడా మీరు ఓడిపోయారు. పార్టీ ఇప్పుడు ఉన్న కష్టకాలంలో కచ్చితంగా గెలుపు గుర్రాలకి సీట్లు ఇవ్వాలనే ఉద్దేశంతో అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయిన కొలుసు పార్థసారథికి సీటు ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలోఎందరో సీనియర్ నాయకులకు కూడా సీట్లు రాలేదు. అయినా కూడా పార్టీ కోసం శ్రమిస్తున్నారని మేము భావిస్తున్నాం. ఇదంతా ప్రజలు గ్రహించి ఖచ్చితంగా పార్థసారథిని గెలిపించుకుంటే ఈ బడుగు, బలహీన వర్గాలకు అండగా ఆయన నిలబడతాడని నమ్ముతున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మసీముకు సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జంగారెడ్డిగూడెంలోని తల్లాడ దేవరపల్లి జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొని జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెం గ్రామానికి చెందిన జంపన శ్రీను(38) మృతి చెందాడు. మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్న జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతి బసు మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలో రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువ అవుతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పలు వార్డులలో నలుగురు వ్యక్తులను కుక్కలు గాయపరిచాయి. వారు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు కుక్కలు దాడి చేస్తున్నాయని, వాహనదారులను, బాటసారులపైన దాడి చేస్తున్నాయని, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉన్నత ప్రణాళికలతోనే సంస్థకు గుర్తింపు

పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రణాళిక బద్ధంగా చేపట్టిన వివిధ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, సంస్థకు గుర్తింపు తెస్తున్నాయని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ అన్నారు. మండలంలోని పాతూరు గ్రామంలో ఆదివారం మానవతా భీమడోలు శాఖ నెలవారీ సమావేశాన్ని శాఖ కార్యదర్శి ఎ.బాబీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి వెజ్జు బాలాజీ నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షల్లో జాతీయస్థాయి ర్యాంకు సాధించి ప్రస్తుతం తిరుపతి ఐఐటీలో చదువుతున్న మానస పాఠశాల పూర్వ విద్యార్థి వెజ్జు యశ్వంత నాయుడును మానవత భీమడోలు శాఖ సత్కరించింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల ద్వారా ఇప్పటికే పలువురు విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి ఉద్యోగ, విద్య రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. వీరిలో ఒకరిగా వెజ్జు యశ్వంత నాయుడు ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. రానున్న కాలంలో మరింత మంది విద్యార్థులు ఇదే తరహా ర్యాంకులు సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తామని, తగు రీతిలో సహకరిస్తున్నామని తెలిపారు. అనంతరం మానవత భీమడోలు శాఖ ద్వారా ట్రిపుల్ ఐటీలో ర్యాంకు సాధించిన యశ్వంత్ నాయుడుకు మెమెంటో, ప్రశంసా పత్రం, నగదు పురస్కారాన్ని అందజేశారు. యశ్వంత్ నాయుడుతో పాటు అతని తల్లిదండ్రులను తగు రీతిలో సత్కరించారు. ఇదే క్రమంలో దాతలు, సభ్యుల సహకారంతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన భీమడోలు మానవత శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి విశేష కృషి చేసిన భీమడోలుకి చెందిన బొమ్ము గాంధీని శాఖ సత్కరించింది. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మానవత జిల్లా సమన్వయకర్త ఆర్.గంగాధర రావు మాట్లాడుతూ భీమడోలు శాఖ పరిధిలో ఐఎఎస్, ఐపిఎస్ పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి సహకరించేందుకు శాఖ నిర్ణయించిందని, దీనికి అవసరమైన ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాఖ కార్యదర్శి ఎ.బాబి మాట్లాడుతూ మానవత భీమడోలు శాఖ ద్వారా ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఇబ్బందుల్లో ఉన్న వారిని తగురీతిలో ఆదుకుంటున్నామని తెలిపారు. దీనిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు శాఖ పరిధిలోని ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరికి తక్కువ కాకుండా సభ్యులుగా చేరి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాఖ ఛైర్మన్ గుళ్ళనూకరాజు, సమన్వయకర్త పంచకర్ల సత్యనారాయణ, ఇతర ప్రముఖులు ప్రసంగించారు. సన్మాన గ్రహీతలను అభినందించారు.


పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న మానవత సభ్యులు

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ముసునూరు: ఆంధ్రప్రదేశ్ గురుకులంలో చదువుకునేందుకుగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ముసునూరు ఎపి ఆర్జెసి పాఠశాల ప్రిన్సిపల్ కొండబత్తుల ప్రవీణ తెలిపారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ నేటి నుంచి మార్చి 31వ తేదీలోపల ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న బాల బాలికలు ఐదోతరగతిలో ప్రవేశం పొందేందుకుగాను దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోను ముసునూరు, నిమ్మకూరు, పులిగడ్డ అదేవిధంగా జిల్లాలో నాగిరెడ్డిగూడెం, అప్పలరాజుగూడెం, పాఠశాలలో ఆయా నిబంధనల ప్రకారం ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 8712625032 కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలి

సినీ నటులు సుమన్

భీమడోలు: విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రత కలిగి ఉండాలని, కష్టపడి కాక ఇష్టపడి చదవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని ప్రముఖ సినీ నటులు సుమన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో పర్యటించారు. శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి చేపడుతున్న నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా 60 మంది వికలాంగులకు నెలవారీ రేషన్గా సన్న బియ్యం, పండ్లు, ఇతరాలు అందించే కార్యక్రమంలో సినీ నటుల సుమన్ పాల్గొన్నారు. ఈనెల రేషన్ సమకూర్చిన ఏలూరుకు చెందిన నెరోలాక్ పెయింట్స్ సంస్థ సేవలను కొనియాడారు. అనంతరం గ్రామస్తులు సినీ రంగానికి విశేష సేవలను అందించిన సుమన్కు పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు దాట్ల సీతారామరాజు, శ్యామల రాజు, సినీ డైరెక్టర్ తోట రవి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

డిఎన్ఆర్ మళ్లీ ఆశీర్వదించండి : స్వాతి

ముదినేపల్లి: రానున్న ఎన్నికల్లో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును మళ్లీ ఆశీర్వదించాలని డిఎన్ఆర్ చిన్న కోడలు దూలం స్వాతి కోరారు. రానున్న ఎన్నికలలో వైసిపి అభ్యర్థుల విజయాన్ని కాం క్షిస్తూ ఆదివారం మండలంలోని కొరగంటిపాలెం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో వైసిపి శ్రేణులతో కలిసి పర్యటిస్తూ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావులు జగనన్న ఆశీస్సులతో పోటీ చేస్తున్నారని, జనాశీస్సులు కూడా వారిరువురికి అందించి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి విజయం చేకూర్చాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రములో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అధికార పార్టీకి కోడ్ వర్తించదా?

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలోని రోడ్లపై ఎక్కడ చూసినా కార్లపై వైసిపి రాజకీయ నాయకుల స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. రాజకీయ నాయకుల స్టిక్కర్లతో రోడ్లపై తిరుగుతున్నప్పటికీ ఇటు ప్రభుత్వ అధికారులు కాని, అటు పోలీసులు కాని ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ వారికి ఎన్నికల కోడ్ వర్తించదా? ఇది వారి అధికార దాహానికి నిదర్శనమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.


అధికార పార్టీకి చెందిన కారుపై ఉన్న స్టిక్కర్లు


అధికార పార్టీకి చెందిన కారుపై ఉన్న స్టిక్కర్లు

స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉంది

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో సినీ దర్శకులు ఆదిత్య

చింతలపూడి: 37 సంవత్సరాలు తరువాత కలసి చదుకున్న స్నేహితులను కలవటం సంతోషంగా ఉందని ప్రముఖ సినీ దర్శకులు ఆదిత్య అన్నారు. లింగపాలెం మండలం, సింగగూడెం హైస్కూల్లో 1886-1987 సంవత్సరానికి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగపాలెం మండలంలోని సింగగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదివినట్లు తెలిపారు. ఇక్కడ చదుకున్న తన చిన్ననాటి స్నేహితులను కలవటం, వారితో మాట్లాడటం మాటలో చెప్పలేని పరిస్థితి అన్ని అన్నారు. మనసంతా నువ్వే, నేనున్నాను, ఆట, ప్రేమకథా చిత్రాలు, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నట్లు తెలిపారు. తన హయాంలోనే ఆహా ఓటిటి వచ్చిందన్నారు. ఫిల్మ్ ఫేర్ అవార్డులో తెలుగు నుంచి ఒకే ఒక్కడిగా ఉన్నట్లు తెలిపారు. తర్వలో 3 సినిమాలు రిలీజ్కి దూరంగా ఉన్నాయా, విడుదలకు దగ్గరగా ఉన్నాయని అన్నారు. త్వరలోనే ఒక పెద్ద హీరోయిన్తో సినిమా చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఒక పెద్ద హీరోకి సినిమా కథ చెప్పినట్లుగా, త్వరలోనే సెట్స్పైకి వెళ్లే అవకాశం ఉందని తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణా : టిప్పర్లు స్వాధీనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అర్ధరాత్రి వేళ గుట్టు సప్పుడు కాకుండా రహస్యంగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు అడ్డుకొని వాహనాలను తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి బొమ్మినంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. విఆర్ఒలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొమ్మినంపాడు పంచాయతీ కార్యాలయం సమీపంలో శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో మైనింగ్ అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన రహస్య సమాచారంతో ముదినేపల్లి తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి ఆదేశాల మేరకు పెయ్యేరు విఆర్ఒ కారే కేశవ, బొమ్మినంపాడు విఆర్ఒ సుబ్రహ్మణ్యం బొమ్మినంపాడు నుంచి గుడివాడ వెళ్తున్న నాలుగు టిప్పర్లను చాకచక్యంగా ప్లాన్ వేసి పట్టుకుని లోడుతో ఉన్న వాహనాలను ముదినేపల్లి తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు సోమవారం తహశీల్దార్ కుమారి జరిమానా విధించనున్నట్లు విఆర్ఒలు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా ఆదివారం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు వైద్యాధికారిణి బి.గాయత్రి తెలిపారు. క్షయ వ్యాధి నివారణకై పిహెచ్సి సిబ్బందితో ఆయా పాఠశాలలలో, స్వయం సహాయక సంఘాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించి తగు మందులు వాడినట్లయితే వ్యాధిని నివారించుకోవచ్చని తెలిపారు. క్షయవ్యాధి మహమ్మారిని తరిమి కొట్టేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని పరీక్షలు, మందులు అందుబాటులో వున్నాయని అన్నారు. ఎవరికైనా రెండు వారాలకు మించి పొడిదగ్గు వస్తున్నట్లయితే పిహెచ్సికి వచ్చి సంబంధింత పరీక్షలు చేపించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి పర్యవేక్షకులు రవిరాజు, వైద్య సిబ్బంది నాగేశ్వరావు, శ్రీనివాసరాజు, మంగతాయారు, ప్రసాద్, కేజియా, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


నూజివీడు రూరల్: అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని టిబి యూనిట్లో ఆదివారం వైద్యాధికారి డాక్టర్ ఎ.దుర్గాభవాని ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎవిఆర్ మోహన్, డాక్టర్ నరేంద్ర సింగ్ మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో 'ఎస్ వుయ్ కెన్ ఎండ్ టిబి' అనే నినాదాన్ని పూర్తిగా పాటించనున్నట్లు తెలిపారు. రెండు వారాలకు పైబడి దగ్గు, ఛాతిలో నొప్పి, జ్వరం, ఆకలి మందగించటం, తెమడలో రక్తపు చారలు, రాత్రి వేళ జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే క్షయ రోగ నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. లక్షణాలు ఉన్నప్పటికీ క్షయ కాక పోవచ్చని, దీనికి ఏమాత్రం భయ పడవద్దన్నారు. నిర్ధారణ జరిగిన వారికి కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, క్షయ వ్యాధి పట్ల, వ్యాధి లక్షణాల పట్ల ఏమాత్రం భయపడవలసిన అవసరం లేదని, అవగాహనతో ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, టివి యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం సీటు బాలరాజుకే..!

జనసేన శ్రేణుల్లో సందడి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండల కేంద్రంలో, గ్రామాలలో జనసేన శ్రేణుల్లో సందడి నెలకొంది. గత కొన్ని రోజులుగా పోలవరం సీట్ ఎవరికి అన్న సందేహంలో నాయకులు, ప్రజలు ఉన్నారు. గ్రామాల్లో విస్తృత స్థాయి పర్యటనలు చేపట్టిన బాలరాజు ఈసారి కూడా జనసేన పోలవరం సీట్ మనకే అని చెప్పినా.. అందరిలో అనుమానాలు నెలకొన్నాయి. ఒకానొక సమయంలో ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు మోడియం సూర్యచంద్ర ఆర్థికంగా కూడా బలంగా ఉన్న వ్యక్తి ఆయనకే సీట్ అని ఊహాగానాలు గట్టిగా వినిపించాయి. ఇంకోసారి టిడిపి పోలవరం ఇన్ఛార్జి బొరగం శ్రీనివాస్ అని జనసేన పార్టీ కండువా మార్చుకుంటారు అని ప్రచారం కొనసాగింది. ఇంకా పలు రకరకాలు పేర్లు విస్తృతంగా వినబడ్డాయి. టిడిపి మండల, గ్రామస్థాయి నాయకులు జనసేనకు పోలవరం సీట్ కేటాయిస్తే ఓట్ ట్రాన్స్ఫర్ అవ్వదని, గ్లాస్ గుర్తుపై ప్రజలకు అవగాహన లేదని, ఇలా పలు రకాల భేదాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఇన్ని ఊహాగానాల మధ్య ఎట్టకేలకు శనివారం జనసేనని పవన్, నాగబాబు చేతుల మీదుగా చిర్రి బాలరాజు బి ఫామ్ అందుకున్నారు. చిర్రి బాలరాజు కూటమి అభ్యర్థిగా ఖరారు కావడంతో ఉమ్మడి పార్టీ నాయకులు బాలరాజుకి మా పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం శిరసా వహిస్తాం, పూర్తిగా సహకరిస్తాం అని సోషల్ మీడియా వేదికగా మద్దతు తెలుపుతున్నారు. పోలవరం అభ్యర్థి జనసేన నుంచి అవ్వాలని కరాటం రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి పట్టు పట్టి సాధించారని జనసేన నాయకులు, కార్యకర్తలు లోగుట్టు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న బాలరాజు

చిర్రి బాలరాజు నేపథ్యం: చిర్రి బాలరాజుది పోలవరం నియోజవర్గం, జిలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గ్రామం. ఈయన బిఎ డిగ్రీ పట్టభద్రులు, తండ్రి కృష్ణాయ్య, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, తల్లి గృహిణి, భార్య జ్యోతి గృహిణి, ఇద్దరు సంతానం. 2019 సార్వత్రిక ఎన్నికలలో జనసేన నుంచి పోటీ చేసి వైసిపి అభ్యర్థి తెల్లం బాలరాజుపై ఓడిపోయారు. అప్పటి నుంచి పోలవరం నియోజవర్గంలో జనసేనని బలోపేతం చేయడంలో కృషి చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, నియోజవర్గం సమస్యలపై పోరాడుతూ, పార్టీని నమ్ముకున్న వారికి ఆసరాగా ఉన్నారు. జనసేన అధిష్టానం ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని ఈసారి కూడా పోలవరం సీట్ ఇచ్చారు.

సవాళ్లు: పోలవరం సీట్ కాంగ్రెస్, టిడిపి కంచుకోట. విభజన తరువాత 2014లో టిడిపి మోడియం శ్రీనివాస్ 83,767 ఓట్లతో గెలిచారు. 2019లో వైసిపి అభ్యర్థి తెల్లం బాలరాజు 110,523 మెజార్టీతో గెలిచారు. 2019లో జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు 13,378, 6.28 పర్సెంట్ ఓట్లు సాధించారు. ఇప్పటికే వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సతీమణి తెల్లం రాజ్యలక్ష్మి అభ్యర్థిగా వరుస పర్యటనలతో, గ్రామస్థాయి సమావేశాలతో దూసుకుపోతున్నారు. వై నాట్ 175 జగన్ నినాదం గ్రామ గ్రామాలకు చేరవేశారు.

ఇప్పుడు జనసేన ముందున్న అతిపెద్ద సమస్య: టిడిపి, బిజెపి నాయకులను, కార్యకర్తలను ప్రసన్నం చేసుకుంటూ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామస్థాయిలో టిడిపి నాయకులలో కొంత వ్యతిరేకత జనసేన ఎదుర్కొంటుంది. టిడిపికి బలంగా ఉన్న పోలవరం నియోజకవర్గంలో జనసేనకు సీట్ కేటాయించడంపై టిడిపి క్యాడర్లో లోపల అంతర్మథనం ఏర్పడింది. ఇలాంటి సందర్భంలో అంతగా పరిచయం లేని వ్యక్తి గెలుపు బావుట ఎగరవేస్తారా అన్నది టిడిపి కార్యకర్తల్లో, నాయకులలో పెద్ద సందేహం. ముందుగా కూటమిలో ఉన్న పార్టీలలో ఏకాభిప్రాయం తీసుకురావడం అనేది పెద్ద సవాలు తీసుకొచ్చినట్టయితే అదే మొదటి విజయం. 2019లో జనసేన, టిడిపి విడివిడిగా పోటీ చేయడంతో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఇరు కార్యకర్తల మధ్య అనేక విభేదాలు ఏర్పడ్డాయి. అధినేతల స్థాయిలో ఆ సమస్యలకు జవాబు దొరికినా క్రిందిస్థాయిలో ఆ మద్దతు ఎంతవరకు ఉంటుంది అన్నది ఒక ప్రశ్న. విస్తృత స్థాయి సమావేశాలలో మూడు పార్టీలు కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటి బాధ్యతలు ఎవరు తీసుకోవాలి అన్నదానిపై నీలి నీడలు అలుముకుని ఉన్నాయి. కూటమిలో కుమ్ములాటలు మొదలైతే, వైసిపి అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి గెలుపు నల్లేరు మీద నడకే అని వైసిపి కార్యకర్తలు, నాయకులు అనుకుంటున్నారు. ఇలాంటివి దాటుకుని జనసేన నిలబడి గెలవగలదా అన్నదే సూటి ప్రశ్న. రాష్ట్ర వ్యాప్తంగా ఒక సెంటిమెంట్ ఉంది. పోలవరం ఏ పార్టీకి వస్తే, అదే పార్టీ అధికారంలో ఉంటుందని దానికి ఎంత న్యాయం చేస్తారో వేచి చూడాలి.

పలుచోట్ల మట్టల ఆదివారం వేడుకలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల, కొత్త పట్టిసీమ, పోలవరం, ఎల్ఎన్డి పేట, ప్రగఢపల్లి గ్రామాలలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్త పట్టిసీమలో సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో సండే స్కూల్ పిల్లలు గ్రామ వీధుల్లో మట్టలతో తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి సంఘ కాపరి ఏడి ఆశీర్వాదం సంఘ సభ్యులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి సిఆర్డి ఇమ్మానుయేలు ఆల్టర్నేట్ డెలిగేట్ జి.అబ్రహం, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

ముసునూరు: భక్తి భావజాలంతో ప్రజలు ఎల్లప్పుడూ వున్నట్లేయితే చెడు కార్యక్రమాలకు దూరంగా వుంటారని రక్షణ సైన్యం చర్చి ఫాస్టర్ ఎం.రాజావనిత అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ముసునూరు రక్షణ సైన్యం చర్చి ఫాస్టర్ ఎం.రాజావనిత ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లో మట్టలతో ఏసుక్రీస్తు ఆకారంలో వున్న బొమ్మలతో అలకరించి గ్రామోత్సోహం నిర్వహించారు.

మండవల్లి : మట్టల ఆదివారాన్ని క్రైస్తవ సహోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును ఆనాడు బేతనీయ గ్రామం నుంచి గాడిదపై ఎక్కించి నూతన వస్త్రాలు పరచి నడిపిస్తూ ఖర్జూర మట్టలు చేతబట్టి, పాటలు పాడుకుంటూ ఎరుషలేముకు తీసుకువెళ్లారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక రక్షణ సైన్యం ఆధ్వర్యంలో చిన్నారులు ఆదివారం ఉదయం ఈతమట్టలకు రంగు రంగు పూలను అలంకరించుకొని, పాటలు పాడుకుంటూ గ్రామ పురవీధుల్లో పెద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్ శాస్త్రి మాట్లాడుతూ సిలువ శ్రమదినాలలో చివరి రోజులు గడుస్తున్నాయని అన్నారు. అయితే ఏసుక్రీస్తు గాడిదపై ఎరుషలేము దేవాలయాలకు తీసుకొచ్చిన అనంతరం ఆయనను సిలువకు అప్పగించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రజలందరూ శాంతి సమాధానాలతో వర్ధిల్లాలని ఫైర్ ప్రెయర్ టీం సభ్యులు జి.జ్ఞాన్ రాజు అన్నారు. మండలంలోని ప్రకాష్ నగర్లో షాలేము ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాలేము, స్టీవెన్ పాల్గొన్నారు.

కలిదిండి : మట్టల అదివారాన్ని పురస్కరించుకొని మండలంలోని కోరుకొల్లు, కలిదిండి, కొండూరు, భాస్కరరావు, గుర్వాయిపాలెం, హరిజనవాడ, పెదలంక గ్రామాల్లోని ఆర్సిఎం చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈత మట్టలు చేపట్టిన మహిళలు, చిన్నారులు పురవీధుల్లో క్రీస్తు బోధనలతో ఊరేగింపు జరిపారు. స్థానిక ఆర్సిఎం చర్చి నుంచి ప్రధాన సెంటర్ వరకు రెవరెండ్ ఫాదర్ బంటుమిల్లి యోహాను ఆధ్వర్యంలో ప్రార్థనలు చేస్తూ తరలి వెళ్లారు. క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలో ఆదివారం క్రైస్తవ సోదరులు ఈత మట్టలతో పవిత్ర మట్టల ఆదివారం పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆనాడు యేసుక్రీస్తును గాడిదపై కూర్చోబెట్టి ఊరేగించిన రోజును స్మరించుకుంటూ పురవీధులలో ఈత మట్టలకు పూలు అలంకరించి క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించుకుంటూ ప్రధానవీధులలో ఊరేగారు. ఎల్ఎఫ్, ఆర్సియం, సిఎస్ఐ, పెంతుకోస్తు తదితర సంఘాల క్రైస్తవ సోదరులు, మత బోధకులు పవిత్ర మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండల విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు నక్కా చైతన్య శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఉంగుటూరు మండల సంఘ అధ్యక్షులుగా అనుపోజు వీరవెంకటబ్రహ్మం, గౌరవ అధ్యక్షులు కవులూరి అప్పారావు, ఉపాధ్యక్షులుగా యర్రోజు సుబ్బయ్యాచార్యులు, కోశాధికారిగా పుల్లూరి సత్యన్నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్గా ఆరిపాక వెంకటేశ్వరరావు, సహాయకార్యదర్శిగా బాణాల శ్రీనివాసాచార్యులు మరో 19 మందితో కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

టిడిపి టిక్కెట్ ఇవ్వకపోవడంపై ఆవేదన

ప్రజాశక్తి - కామవరపుకోట

ఏలూరు పార్లమెంట్ టిడిపి టిక్కెట్ విషయంలో కనీసం పార్టీ నాయకత్వం పిలిచి మాట్లాడకపోవడంపై ఆవేదనగా ఉందని గోపాల్ యాదవ్ అన్నారు. కంఠమనేని వారి గూడెంలో తన ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను బిసి సామాజిక వర్గంకి చెందిన వాడిని అవ్వడం వల్లనే చిన్న చూపు చూస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడం కోసమే పాలిటిక్స్లోకి వచ్చానన్నారు. నా మీద ప్రజలో ఏమైనా వ్యతిరేకత ఉందా? ఎందుకని టిక్కెట్ ఇవ్వలేదు అని ఆయన పార్టీ అధిష్టానంను ప్రశ్నించారు. రెండు, మూడు రోజుల్లో తన కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు.

రంజాన్ ఉపవాస ప్రార్థనలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో రంజాన్ పవిత్ర ఉపవాస ప్రార్థనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అహెలె సున్నత్ జమాతె మసీదులో ప్రత్యేక నమాజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి యాసీన్ షరీఫ్ తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో హిందూ సోదరులు మమేకమై ఉపవాస ప్రార్థనలలో, ఇఫ్తార్ విందులలో పాల్గొని, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని, ఇఫ్తార్ విందులలో అల్పాహారాలు, పౌష్టికాహారాలు అందిస్తున్నారని తెలిపారు.